క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు



ప్రశాంత్‌నగర్(సిద్ది పేట): ముస్లింలకు ఎమ్మెల్యే హరీశ్‌రావు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ అంటే త్యాగం, సహనం అన్నారు. అంతేకాకుండా భక్తిభావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమన్నారు. అల్లా దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు.

18న జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం ఎన్నికలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 18వ తేదీన సిద్దిపేట జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు సిద్దిపేట జిల్లా నాయీబ్రాహ్మణ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. జిల్లాలోని 25 మండలాల కమిటీ సభ్యులతో పాటుగా, పట్టణ నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఎన్నికలు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నిర్మాణ కమిటీ సభ్యులు సింగరాల కనకయ్య, జాలిగామ విద్యాకర్, కొండూరి సతీష్ ,సింగిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

19న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 19వ తేదీన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి మేడి పాపన్న తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

బాలుడికి చెలిమి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి చెలిమి ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. గజ్వేల్ మండలం గిరిపల్లికి చెందిన ఎంకమొల్ల స్వామి, కవిత దంపతుల కుమారుడు ప్రణీత్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గజ్వేల్ చెలిమి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ ప్రతినిధులు తులసీదాస్, యాదగిరి, ఆనంద్, శ్రీనివాస్, ఆంజనేయులు, నర్సింహులు, రమేష్, రవీందర్, కృష్ణ, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్

ములుగు(గజ్వేల్): భద్రాచలంలో రోటరీ క్లబ్ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించినట్లు గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ తెలిపారు. 2023–24లో క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. గజ్వేల్ రోటరీ క్లబ్‌కు 15 విభాగాల్లో అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. తనకు సహకరించిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నరసింహారెడ్డి, చంటి, కరుణాకర్‌రెడ్డి, జగదీశ్వర్, సాయిరెడ్డి, నరేష్‌గౌడ్, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న కిషన్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో మహాలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అలుమల్ల వనిత, కిషన్ రెడ్డి దంపతులు ఆదివారం విరాళంగా అందజేశారు. దేవాలయ నిర్మాణానికి తమ వంతు ఇవ్వాలని రూ.50,116 విరాళం అందించినట్లు చెప్పారు. దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ తోడేటి రమేశ్ అభినందించారు.

పొంచివున్న ప్రమాదం

అక్కన్నపేట మండలం మల్లంపల్లి చెరువుపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదు. గతంలో రెండుసార్లు చెరువు కట్టకు బుంగ పడి తూము సైతం కొట్టుకుపోయింది. కట్టకు బుంగ పడటంతో నాడు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం చెరువు కట్టకు పగుళ్లు వచ్చి ప్రమాదం అంచులో దర్శనమిస్తోంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- మల్లంపల్లి చెరువు కట్టకు పగుళ్లు
- వర్షాకాలం మొదలవడంతో రైతుల్లో ఆందోళన
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు



మల్లంపల్లి చెరువు

అక్కన్నపేట(హుస్నాబాద్): గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువు కట్ట మరమ్మతులకు సుమారుగా రూ.2 కోట్లు మంజూరు చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ పనులంతా నాసిరకంగా చేయించాడని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు కట్టంతా పగుళ్లు వచ్చి ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని భయం భయంగా తిరుగుతున్నామని చెబుతున్నారు. చెరువు తూముకు సరిగ్గా మరమ్మతులు చేయలేదని, కట్టపై దాదాపు మీటరు మేర రెండు చోట్ల మట్టి కిందకు జారుతోంది. కట్టపై పగుళ్లు వచ్చి పెద్ద గొయ్యిలుగా ఏర్పడ్డాయి.

చెరువు నిండక ముందే

అక్కన్నపేట మండలంలోని అన్ని చెరువుల కంటే పెద్దచెరువు ఇది. భారీ వర్షాలకు చెరువు నిండక ముందే చెరువు కట్టకు మరమ్మతులు చేయించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో చెరువు కట్ట ప్రమాదంలో పడేలా ఉందని ఆవేదన చెందుతున్నారు. దాదాపు 100 ఎకరాలకుపైగా ఈ చెరువు కింద సాగవుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి చెరువుకు త్వరగా మరమ్మతులు చేయించాలని రైతులు వేడుకుంటున్నారు.



చెరువు కట్టకు పడిన బుంగ

మరమ్మతులు చేయించాలి



చెరువు కట్ట బీటలువారింది. ఇది వరకే రెండుసార్లు చెరువు కట్టకు బుంగ పడింది. కట్టపై రెండుచోట్ల మట్టి కిందకు జారుతోంది. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని భయం వేస్తోంది. అధికారులు స్పందించి చెరువు నిండకముందే కట్టకు మరమ్మతులు చేయించాలి. తూము కూడా సరిగ్గా పనిచేయడం లేదు.

– మార్క తిరుపతి, మాజీ సర్పంచ్, మల్లంపల్లి గ్రామం

నిందితులను కఠినంగా శిక్షించాలి

- గిరిజన నాయకులు ఆందోళన



ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్: మైనర్ బాలిక వసంతపై అత్యాచారం , హత్యచేసిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు తిరుపతి నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో బంజారా మహిళలు, యువతలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటితో పాటుగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇలాంటి సంఘటన ఎక్కడా పునరావృతం కాకుండా నిందితులను ప్రజల సమక్షంలో శిక్షించాలన్నారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యం నాయక్, లైవ్ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భూక్య కృష్ణనాయక్, నాయకులు లకావత్ లకపతి నాయక్, భానోతు రవీందర్, రైనా నాయక్, దేవస్ నాయక్, వీరునాయక్, వీరన్న నాయక్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న కిరణ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్ గ్రామానికి చెందిన ఎర్ర మల్లేశం గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ రూ.1.60 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం చేయించుకునేందుకు మల్లేశం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లగా ఎల్‌ఓసీ మంజూరు చేశారన్నారు.

రఘునందన్‌రావును విమర్శించే అర్హత లేదు

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేష్



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేష్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రఘునందన్‌రావును విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ నాయకులకు లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రజలు బీజేపీకి ఓటు వేశారన్నారు. ఈ విషయాన్ని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారన్నారు. సమావేశంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు తొడుపునూరి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి దాబా నరేష్, పట్టణ ఉపాధ్యక్షుడు పుల్లయ్యగారి వెంకట్ గౌడ్, పట్టణ కార్యదర్శి రాగరం శ్రీను, గరిపల్లీ సాయి బాబా, పట్టణ బీజేవైఎం నాయకులు కాస నగట్టు సాయి కృష్ణ పాల్గొన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు



బెజ్జంకి(సిద్దిపేట): కూరగాయలు, ఉల్లిగడ్డ ధరలు ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. టమాటా, బీర, చిక్కుడు తదితర కూరగాయల ధరలు మార్చి, ఏప్రిల్‌లో కిలో రూ.40 నుంచి 50 ఉండేవి. ఇప్పుడు ఒక్కసారిగా రూ.100 పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. ఉల్లిగడ్డ కిలో రూ.20 నుంచి రూ.50 పెరిగింది. నీరు లేక కూరగాయలను రైతులు పండించలేకపోతున్నారు. పెరిగిన ధరలతో ఎవరూ కొనడం లేదని చిరు వ్యాపారులు, రైతులు వాపోతున్నారు. కిలో కొనేవారు ఇప్పుడు పావుకిలో మాత్రమే కొంటున్నారని చెబుతున్నారు. ధరల నియంత్రణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధి కోసం వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారంతా కలుసుకున్నారు. 16 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో సందడి చేశారు. పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

‘పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం’

శివ్వంపేట(నర్సాపూర్): పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. ఆదివారం సెలవురోజు అయినా.. రెవెన్యూ సిబ్బంది పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 230 పెండింగ్ మ్యుటేషన్, పౌతి, ఇతర రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆదివారం 50 పెండింగ్ సమస్యలు పరిష్కరించామని అన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్‌ఐ కిషన్ పాల్గొన్నారు.



పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

సంక్షిప్త వార్తలు

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): మేదర సంఘం మండల నూతన కమిటీని ఆ సంఘం నాయకుడు భీమయ్య సమక్షంలో ఆదివారం బెజ్జంకిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బొమ్మిడి రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా అలిపిరెడ్డి శంకర్, కోశాధికారిగా బొమ్మిడి లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా బొమ్మిడి సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, సంతోష్, సతీష్, సాయివర్దన్ ఎన్నికయ్యారు.

◆ బీమా సొమ్ము అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పురుషుల పొదుపు సంఘం సభ్యుడు బండిపెల్లి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంఘం నుంచి వచ్చిన పొదుపు, బీమా సొమ్ము రూ.67,869 ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు రవి, రమేష్, సాయిలు, మహేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ శివాజీ విగ్రహ ఆవిష్కరణ



చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని వీరభద్ర కళామందిర్ సమీపంలో శనివారం రాత్రి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పట్టణ ముస్లింలు పాల్గొని హిందూ ముస్లిం భాయిభాయి అని చాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డుకు ఛత్రపతి శివాజీ మార్గ్ అని నామకరణం చేయాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆదివారం తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ

ఎల్లమ్మ జాతరకు భక్త జనం



క్యూ లైన్‌లో కిక్కిరిసిన భక్తులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో కొనసాగుతున్న ఎల్లమ్మ జాతరకు భక్త జనం తరలివచ్చారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి తీరొక్క మొక్కులు సమర్పించారు. ఒడిబియ్యం, బోనాలు సమర్పించి, పట్నాలు వేసి అమ్మవారిని వేడుకున్నారు.

నేత్రపర్వంగా సువర్చల హనుమాన్ కల్యాణం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీ హనుమాన్, సువర్చల కల్యాణం ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ వీర హనుమాన్ ఆలయం ఆవరణలో శ్రీ హనుమాన్, సువర్చల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం స్వామి వారికి మహాభిషేకం, హోమం, తదితర కార్యక్రమాలు చేశారు. కల్యాణం ముందు హనుమాన్, సువర్చల విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో అరవపల్లి రఘురామ శర్మ, మరింగంటి శ్రీకరాచార్యులు, రాం బహదూర్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.



సువర్చల, హనుమాన్ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోనమెత్తిన మాచాపూర్



బోనాల ఊరేగింపు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. పోచమ్మ, మైసమ్మలకు బోనాలు సమర్పించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు హన్మంతారెడ్డి, నాయకులు రాజిరెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై అసత్య ఆరోపణలు తగవు

- బీఆర్‌ఎస్ నాయకులు

ములుగు(గజ్వేల్): మండలంలోని క్షీరసాగర్‌లో ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అక్రమంగా భూములు ఆక్రమించారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చేసిన ఆరోపణల్లో నిజం లేదని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆరోపణలు నిజమని నిరూపిస్తే ఆ భూములను తామే పంపిణీ చేస్తామన్నారు. ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు జహంగీర్, మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొన్యాల బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తారక సురేష్ తదితరులు విలేకరుల సమావేశంలో రఘునందన్‌రావు ఆరోపణలను ఖండించారు. అసత్య ఆరోపణలు తగవన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న అదనపు సీఐ ముత్యంరాజు

గజ్వేల్‌రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ సాయంతో స్వాధీనం చేసుకున్న పోలీసులు తిరిగి బాధితులకి అందజేశారు. ఆదివారం గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములఘట్ గ్రామానికి చెందిన కొండల్‌రెడ్డి, గజ్వేల్‌కు చెందిన నీరుడి తిరుపతి తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి సెల్‌ఫోన్‌లు దొరికినవారి నుంచి స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తే తిరిగి లభించే అవకాశం ఉందన్నారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లను ఎవరూ కొనుగోలు చేయొద్దన్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?

చేగుంట(తూప్రాన్): దశాబ్దం క్రితం నిర్మించిన రోడ్డు శిథిలమై అధ్వానంగా మారింది. మండలంలోని రెడ్డిపల్లి కాలనీ నుంచి చేగుంట వరకు నిర్మించిన తారు రోడ్డు గతుకుల మయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో మార్కెట్ కమిటీ, సివిల్ సప్లయ్ గోదాం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్, మోడల్ స్కూల్, గిరిజన గురుకుల పాఠశాలలతో పాటు సీఎంఆర్ కాలనీ ఉంది. రెడ్డిపల్లికాలనీ మీదుగా వడియారం రైల్వే స్టేషన్‌కు రావడానికి దూరం తక్కువగా ఉండటంతో ఈరహదారి గుండా చాలా వాహనాలు వెళ్తాయి. రెండేళ్ల క్రితం రోడ్డు శిథిలావస్థకు చేరుకోగా రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అధికారులకు స్థానికులు రోడ్డు బాగు చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదు. అధికారులు, నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వర్షపు నీరు నిలిచిన రెడ్డిపల్లికాలనీ - చేగుంట రోడ్డు

గో సంరక్షకుల అరెస్ట్ సరికాదు

పెద్దశంకరంపేట(మెదక్): మెదక్‌లో జరిగిన సంఘటనకు సంఘీభావం ప్రకటించిన గోసంరక్షకుడు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ అరెస్ట్ సరికాదని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోవధ నిషేధమని, వాటిని సంరక్షించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా కొందరి నిర్లక్ష్యంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూర్య ప్రకాష్, అశోక్ పాల్గొన్నారు.